

విత్తనాలు నాణ్యమేనా?

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి వాతావరణం అనుకూలంగా మారితే జూన్ రెండోవారం నుంచి నారుమడులు పోసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా వరి విత్తనాలు ఎంతమేర రైతులకు అందుబాటులో ఉంచుతుందని అనుమానాలున్నాయి. వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై ఇచ్చే విత్తనాలు సైతం పక్కదారి పట్టి బడాబాబులు చేతిలోకి వెళ్లడం ఏటా నిత్యకృత్యంగా మారింది. ప్రయివేటు విత్తనాల నాణ్యతపై రైతులకు నమ్మకం లేదు. ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఏపీ సీడ్స్ నుంచి విత్తనాలు ఎప్పుడు వస్తాయి? ఎప్పటికి రైతులకు అందజేస్తారు? అనే అంశంపైనా సందిగ్ధత నెలకొంది.



ఖరీఫ్‌లో 1,65,789 హెక్టార్లలో వరి సాగు అంచనా

- కావాల్సిన విత్తనాలు 1.03 లక్షల క్వింటాళ్లు
- ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చేది 6,691 క్వింటాళ్లు మాత్రమే
- మిగిలిన విత్తనాలు ప్రైవేటు వ్యాపారుల వద్దనే కొనాలి
- వీటి నాణ్యతపైనే సందిగ్ధత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1,65,789 హెక్టార్లలో వరి సాగు అవుతుందని వ్యవసాయశాఖ అంచనాగా ఉంది. ఎకరానికి 25 కిలోల విత్తనాల చొప్పున నారుమడులు పోస్తారు. వెదజల్లే పద్ధతిలో ఎకరానికి కనీసంగా 18 కిలోల విత్తనాలు వాడతారు. ఈ లెక్కన జిల్లాలో 1.03 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. కానీ వ్యవసాయశాఖ ద్వారా కేవలం 6,691 క్వింటాళ్ల వరి విత్తనాలు సబ్సిడీపై అందజేస్తామని వ్యవసాయశాఖ ఇప్పటికే ప్రకటించింది. బీపీటీ 5204, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 వంటి రకాల వరి విత్తనాల ధరను క్వింటాలుకు రూ.3250 నుంచి రూ.3800 వరకు ధరగా నిర్ణయించారు. వరి విత్తనాల ధర ఎంత ఉన్నా క్వింటాలుకు కేవలం రూ.500 మాత్రమే సబ్సిడీగా అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం విత్తనాల ధర కిలోకు రూ.32 నుంచి రూ.38 వరకు ఉంది. ప్రైవేటు వ్యాపారులు వరి విత్తనాల ధరలను మరింతగా పెంచి విక్రయించడం ఈసారి ఖాయంగా కనిపిస్తోంది. సుమారుగా 96 వేల కింటాళ్ల విత్తనాలను రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద ఈ ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేయాల్సి ఉంది.

కరీంనగర్, గోదావరి జిల్లాల నుంచి వరి విత్తనాలు

ఉభయగోదావరి, కరీంనగర్ జిల్లాల నుంచి ప్రైవేటు వ్యాపారులు అధికంగా వరి విత్తనాలు కొనుగోలు చేసి వ్యాపారులు తీసుకువస్తూ ఉంటారు. ఇందులో సర్టిఫైడ్, నాన్‌సర్టిఫైడ్ విత్తనాలు ఉంటాయి. సర్టిఫైడ్ విత్తనాలయితే రైతులకు క్వింటాలుకు అసలు ధర కన్నా రెండు వందల రూపాయలు అధికంగా ధర పెంచి విక్రయిస్తారు. నాన్‌సర్టిఫైడ్ విత్తనాలను మామూలు ధరకు రైతులు కొనుగోలు చేసినా మొలకశాతం తక్కువగా ఉంటుంది. ఈ అంశంపై ప్రశ్నించడానికి అవకాశం ఉండదు. దీంతోపాటు గత ఖరీఫ్ సీజన్‌లో ఉత్పత్తిచేసిన పాతవిత్తనాలు అయితే 70 శాతం మాత్రమే మొలక ఉంటుంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఉత్పత్తిచేసిన వరి విత్తనాల్లో 80 నుంచి 90 శాతం మొలక ఉంటుంది. పాతవిత్తనం అయితే పంటచేతికొచ్చే సమయంలో పైరు మొదలు కొంతమేర దృఢంగా ఉండి నేలవాలిపోకుండా ఉంటుందని, కొత్త విత్తనం అయితే పంటకోతదశకు ముందు నేలవాలిపోయే గుణం అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

వరి, వేరుశెనగ విత్తనాలు ఇచ్చేందుకు ఎన్ని ఆంక్షలో...

రైతులకు సబ్సిడీపై వరి, వేరుశెనగ విత్తనాలు అందజేసేందుకు ప్రభుత్వం పలు ఆంక్షలను విధిస్తోంది. రైతులు ఆర్‌బీకేలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులను తీసుకువెళ్లి పేర్లు ముందుగానే నమోదు చేయించుకోవాలి. దీంతోపాటు ఎంతమేర విత్తనాలు కావాలో తెలియజేస్తూ వివరాలు అందజేయాలి. రైతుల నుంచి వచ్చిన డిమాండ్‌ను బట్టి జిల్లావ్యాప్తంగా లెక్కగట్టి అప్పుడు ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పెడతారు. వ్యవసాయశాఖ వద్దకు వరి విత్తనాలు వచ్చినా పెద్దరైతులు, లేదా వ్యాపారుల చేతుల్లోకే విత్తనాలు గుట్టుచప్పుడు కాకుండా చేరడం ప్రతిఏటా ఆనవాయితీగా వస్తోంది. రెండు, మూడు ఎకరాల భూమిని సాగుచేసే రైతులు వరి విత్తనాలు కోసం మండల వ్యవసాయశాఖ కార్యాలయాలకు వెళితే ఎప్పుడో అయిపోయాయని, మళ్లీ వస్తాయని అప్పుడు కబురు చేస్తామని చెప్పి పంపేస్తారు. నారుమడులు పోసేందుకు సమయం మించి పోతుండటంతో చిన్నసన్నకారు రైతులు ప్రైవేటువ్యాపారుల వద్ద వరి విత్తనాలు అధిక ధరలకు కొనుగోలు చేసి నారుమడులు పోస్తారు. వేరుశెనగ విత్తనాలను కడప, అనంతపురం జిల్లాల నుంచి తీసుకువస్తారు. పదిమందిలోపు రైతులకు విత్తనాలు పంపిణీ చేసినట్లుగా చూపి గుంపగుత్తగా వ్యాపారుల గూడౌన్‌లకు ఈ విత్తనాలు చేరవేస్తారు. అనంతరం అధిక ధరలకు విక్రయాలు జరుపుతారు. ఈ వ్యవహారం మొత్తం అధికారపార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్న వ్యాపారుల కనుసన్నల్లోనే జరుగుతుంది.

ప్రైవేటు వ్యాపారుల కనుసన్నల్లోనే

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న భూమి పరిస్థితులు, భూసారం, పంట సాగుచేసే సమయాన్ని బట్టి ఆయా గ్రామాల్లో ఈ సీజన్‌లో ఏ రకం వరి వంగడాలను సాగుచేయాలనే అంశంపై వ్యవసాయశాఖ ముందస్తుగానే ప్రణాళికను తయారుచేస్తుంది. గ్రామాల్లో ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆర్‌బీకేల వద్ద, ప్రధాన కూడళ్లలో గోడలపై రాస్తారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు వరి వంగాడాలను సాగు చేయాలని రైతులు ఆలోచనచేసినా క్షేత్రస్థాయిలో అమలుకాని స్థితి. ఖరీఫ్ సీజన్‌లో ఎంటీయూ 1061, 1064, 1121, 7029, 1318, 1224, స్వర్ణ, బీపీటీ-5204, 3291 వంటి వరి వంగడాలను రైతులు సాగుచేస్తారు. కానీ వ్యవసాయశాఖ ద్వారా ఎంటీయూ 1061, 1318, బీపీటీ 5204 రకాలను మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. మిగిలిన రకాల వరి వంగడాలను ప్రైవేటు వ్యాపారుల నుంచే రైతులు కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రైవేటు వ్యాపారులు తమ వద్ద ఉన్న వరి వంగడాలను దిగుబడులు బాగా వస్తుందని చెప్పి రైతులకు అంటగడతారు. దీంతో ప్రైవేటు వ్యాపారుల సూచనల మేరకే రైతులు వరి వంగడాలను ఎంచుకోవాల్సిన స్థితి ఏర్పడుతోంది. ప్రైవేటు వ్యాపారులు ఇచ్చిన విత్తనాలు సక్రమంగా మొలకరాకున్నా, దిగుబడి రాకున్నా ప్రశ్నించేందుకు అవకాశంలేని స్థితి. రైతులు స్వర్ణరకాన్ని కొంతమేర సాగుచేస్తారు. ఆ రకం విత్తనాలు అందుబాటులో లేవని, సంపత్ స్వర్ణరకం విత్తనాలను గతేడాది రైతులకు ప్రైవేటు వ్యాపారులు విక్రయించారు. ప్రైవేటు వ్యాపారులు ఏ కరం విత్తనాలను, ఎంతమేర విక్రయిస్తున్నారనే అంశంపై వ్యవసాయశాఖ పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. ప్రైవేటు వ్యాపారులు నాణ్యమైన వరి విత్తనాలు విక్రయిచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కృత్తివెన్ను మండలం మునిపెడ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న భూమిలో మట్టితోలకాలు

జోరుగా మట్టి వ్యాపారం



కృత్తివెన్ను మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతుంది. ఒక ప్రైవేటు సామ్రాజ్యాన్ని స్థాపించుకుని జోరుగా మట్టి వ్యాపారం సాగిస్తోంది. అక్రమార్కులు ఎటువంటి అనుమతులూ లేకుండా ఇష్టారీతిన తవ్వకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వారు చెప్పిన ధరకే ఎవరైనా మట్టి కొనుగోలు చేయాలి.

కృత్తివెన్ను మండలంలోమట్టి తోలకాలు

- చోద్యంచూస్తున్న అధికారులు
- అనుమతులు లేకుండా ఎకరాలకు ఎకరాలు పూడ్చేస్తున్న బడాబాబులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- జాతీయ రహదారిపై యథేచ్ఛగా మట్టి తోలకాలు

కృత్తివెన్ను : తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. గతంలో స్థానిక ఎమ్మెల్యే జోగి రమేష్ కనుసన్నల్లో జరిగిన మట్టి వ్యాపారం ఆయన ఇక్కడ నుంచి వెళ్లిపోవటంతో ప్రైవేటు వ్యక్తులు అదే మార్గాన్ని అనుసరిస్తున్నారు.

● నిబంధనలు తుంగలోతొక్కి..

పంట చేలను పూడ్చాలన్నా, మట్టిని తరలించాలన్నా తొలుత వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా ల్యాండ్ కన్వర్షన్ చేయించాలి. రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైనేజీ, మైనింగ్ అనుమతులతో పాటు వివిధ శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ మండలంలో ఎటువంటి అనుమతులూ లేకుండా పంట చేలను పూడ్చేస్తున్నారు. తరువాత వాటిని అనధికార లే అవుట్‌లుగా మార్చి, ప్లాట్లుగా విభజించి అమ్ముకోవటం, కమర్షియల్‌గా మార్చుకోవటం పరిపాటిగా మారుతోంది.

● రైతులతో బేరాలు

రైతులకు కావాల్సిన మట్టిని అందించేందుకు కొందరు ప్రైవేటు వ్యక్తులు తమ సామ్రాజ్యాలను స్థాపించారు. మీకు కావాల్సిన మట్టిని నేరుగా మీ చెంతకే తెచ్చి అప్పగిస్తామని అనుమతులతో పని లేదని, ఇతరేత్ర ఖర్చులన్నీ తామే చూసుకుంటామని చెప్పి రూ.400 నుంచి రూ.500 విలువ చేసే మట్టిని రూ.700 నుంచి రూ.1000 రూపాయిల వరకు విక్రయిస్తూన్నారు. నెలలు తరబడి ఎకరాలకు ఎకరాలు పూడ్చుకుంటూ, ప్రైవేటు వ్యక్తులు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిస్తుంటే, అధికారులు వారి దగ్గర నుంచి రోజులు, ఎకరాలను బట్టి ధరలను నిర్ణయించుకొని, దర్జగా దండుకు తింటున్నారు.

ఉప్పులూరులో టిప్పర్లతో మట్టి తరలింపు

కృత్తివెన్ను మండల శివారు మునిపెడ వద్ద జాతీయ రహదారిని అనుకొని ఎకరాలకు ఎకరాలు పంట పొలాలను ఎటువంటి అనుమతీ లేకుండా పూడ్చేస్తున్నారు. చెరుకుమిల్లి శివారు ఉప్పులూరులో రాత్రిపూట టిప్పర్ల సాయంతో మట్టిని తరలించటమే కాకుండ పెద్దఎత్తున నిల్వలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కృత్తివెన్ను, శీతనపల్లి పంచాయతీల్లో జోరుగా మట్టి తోలకాలు సాగుతున్నాయి. నిడమర్రు సమీపంలో అనుమతులు లేకుండా మట్టి తోలకాలతో పాటు చెరువుల తవ్వకాలు సాగుతున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి మండలంలో అక్రమంగా జరుగుతున్న మట్టి తోలకాలు, చెరువుల తవ్వకాలపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మెయింటినెన్స్‌పై సంకోచ్‌మే!

విశాఖ - జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల లింక్ ఫెయిల్

- రెండుగా విడిపోయిన కోచ్‌లు.. ప్రయాణికుల హాహాకారాలు
- ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల నాణ్యత, ప్రయోజనాలపై అనుమానాలు
- కోరమాండల్ ప్రమాదంలో ప్రయాణికులను కాపాడలేకపోయిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు
- మెయింటినెన్స్ లేక లోపాలపుట్టగా రైల్వే కోచ్‌ల నిర్వహణ

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం తర్వాత ట్రాక్ మెయింటినెన్స్‌పై చూపుతున్న శ్రద్ధ రైళ్లపై చూపించటం లేదు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు వస్తున్నాయన్న కారణంతో వాటి మెయింటినెన్స్‌పై రైల్వే నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. బుధవారం విశాఖ నుంచి విజయవాడ వస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల లింకు తెగటం వల్ల బోగీలు వేరవడమే ఇందుకు నిదర్శనం. తాజా సమస్య ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో నెలకొంటున్న సమస్యలను ప్రతిబింబిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దశాబ్ద కాలం కిందట రైల్వేలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ప్రవేశపెట్టారు. ఇవి ప్రమాదరహితమని, మానవ ప్రాణ నష్టాన్ని నిలువరిస్తాయని, అగ్ని ప్రమాదాలను తట్టుకుంటాయని, అన్ని రకాలుగా ప్రయాణికులకు సురక్షితంగా ఉంటాయని భారీ ప్రచారంతో అడుగు పెట్టాయి. జర్మన్ దేశ సాంకేతికతను జోడించి లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లను రూపొందించి రైల్వేలో ప్రవేశపెట్టడం జరిగింది.
మన పొరుగు రాష్ట్రం చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీతో పాటు పంజాబ్‌లోని కపుర్తల, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాయ్‌బరేలీలలో ఈ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను తయారు చేస్తున్నారు. ఈ కోచ్‌లను మొదటి సారిగా 2014 - 15 మధ్య కాలంలో దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ పరిధిలో ప్రవేశపెట్టారు. విజయవాడ డివిజన్ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లలో పదేళ్ల కిందటి నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల ప్రవేశం జరుగుతూ వస్తోంది. క్రమేణా పాత కోచ్‌ల స్థానంలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు వస్తున్నాయి. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను మొదట్లో తీసుకు వచ్చినపుడు ప్రాణాంతక పరిస్థితులను తప్పిస్తాయన్న ప్రచారం చేశారు. రైళ్లు పట్టాలు తప్పినపుడు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు బ్యాలెన్స్ తప్పవని పేర్కొన్నారు. కొద్దికాలం కిందట కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం ఘటనలో బోగీలు పడిపోయాయి. బ్యాలెన్స్ కాలేదు. ఈ ఘటనలో మానవ తప్పిదాలనే హైలెట్ చేశారు తప్పితే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఎందుకు భద్రతను కల్పించలేకపోయాయన్నది పెద్దగా చర్చనీయాంశమే కాలేదు. ఆ ఘటన తర్వాత ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల పనితీరుపై పరిశీలన ప్రారంభమైంది. వీటిలోనూ సమస్యలు పుట్టలుగా ఉంటున్నాయి.

జన్మభూమిలో అన్నీ ఎల్‌హెచ్‌బీలే అయినా...

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో అన్నీ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లే ఉన్నపుడు డీ11, ఎం1 కోచ్‌ల మధ్య లింకు ఎందుకు ఫెయిల్ అయ్యిందో రైల్వే అధికారులే స్పష్టతనివ్వాలి. ట్రెయిన్ చాలా దూరం వెళ్లే వరకు తెలుసుకోలేకపోతే.. ఆ వెనుకన వచ్చే రైళ్లు కానీ, ముందు వచ్చే రైళ్లు కానీ గుద్దితే ఘోర ప్రమాదాలు జరగటానికి ఆస్కారం ఉంటుంది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను సరిగా మెయింటినెన్స్ చేయటం లేదని ఇటీవల కాలంలో ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ కోచ్‌లలో బాత్రూమ్‌లలో నీటిని ఉపయోగించటానికి వీలుగా ఏర్పాటు చేసిన ట్యాంకులలో నీటిని పట్టేటపుడు ఓవర్ లోడ్ అవ్వగానే ఆగిపోవాలి. ఓవర్ లోడ్ కావటంతో ఆ నీరంతా బయటకు వస్తోంది. పోనీ ఆ నీరు పట్టాల మీదకు వెళ్లిపోతుందనుకుంటే ఫర్వాలేదు. పట్టాల మీద కాకుండా ప్లాట్‌ఫామ్‌ల మీదకు చిమ్ముతోంది. స్టేషన్లలో నీళ్లు పట్టేటపుడు ఈ సమస్యల వల్ల ప్లాట్‌ఫామ్‌లు నీటిమయమౌతున్నాయి. ఇలాంటి చిన్న చిన్న లోపాలు కూడా ఎల్‌హచ్‌బీ కోచ్‌లలో కనిపిస్తున్నాయి. సాంకేతికంగానూ, యాంత్రికంగానూ, అంతర్గతంగానూ సమస్యలతో ఉంటున్న ఎల్‌హెచ్‌బీ కోచ్‌లపై రైల్వే అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



బాలిక మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి (ఇన్‌సెట్‌లో) చిన్నారి వాగ్దేవి (ఫైల్)

అయ్యో పాపం

- చెరువులో పడి బాలిక మృతి
- కానూరులో విషాదఛాయలు

పెనమలూరు, మే 22 : స్నేహితులతో సరదాగా ఆడుకుంటూ ఇంటి వెనుక ఉన్న చెరువులో పడి ఎనిమిదేళ్ల పాప మృతిచెందింది. ఈ సంఘటనతో బుధవారం కానూరులో విషాదఛాయలు అలముకున్నాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనమలూరు మండలం కానూరుకు చెందిన ఆరేపల్లి వాగ్దేవి (8) మంగళవారం మధ్యాహ్నం తర్వాత కనిపించ కుండా పోయింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బాలికను ఎవరైనా కిడ్నాప్ చేశారా, కాల్వలో పడిందా అనే కోణంలో పోలీసులు రాత్రంతా గాలించారు. మొత్తం 14 మంది స్నేహితులను విచారణ చేశారు. చివరకు బాలిక ఆమె ఇంటి వెనుక ఉన్న కాల్వలో పడి మునిగిపోయిందని నిర్ధారించుకున్నారు. కాగా, బుధవారం ఉదయానికి బాలిక మృతదేహం నీళ్లపైకి తేలింది. దీన్ని చూసిన చిన్నారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

పోలీసుల నిర్లక్ష్యం..
వివాహితకు ప్రాణ సంకటం!
పలుమార్లు 100కు ఫోన్ చేసినా ఫలితం శూన్యం
- 6లో..

సాగు.. సాగేనా!
ఏనుగులకోడు డ్రెయిన్‌పై సాగునీటి తూములు శిథిలం
- 6లో..
- వేయి ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం
- ఏడాది నుంచి చర్యలు శూన్యం
- నీరంతా ఏనుగులకోడు డ్రెయిన్ పాలు
- బోర్లు, వర్షాలపైనే ఆధారపడాల్సిన దుస్థితి

స్క్రాప్ వ్యాపారి మోసం
రూ.20 కోట్లతో జంప్

కొత్తపేట పోలీసులను ఆశ్రయించిన బాధితులు



మహమ్మద్ అబ్దుల్ ఫహీమ్ (ఫైల్)

వన్‌టౌన్, మే 22 : సాటి వ్యాపారులను నమ్మించి, రూ.20 కోట్ల మేర వసూలు చేసిన వన్‌టౌన్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి చివరకు కనిపించకుండాపోయాడు. దీంతో బాధితులు బుధవారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల కిందటి వరకు వించిపేటలోనే నివాసమున్న మహమ్మద్ అబ్దుల్ ఫహీమ్.. ఆ తర్వాత తాడేపల్లి సమీపంలోని నులకపేటకు మారాడు. ప్రస్తుతం అక్కడి నుంచి కూడా పరారయ్యాడు. ఫహీమ్ గురించి కుటుంబ సభ్యుల వద్ద ఆరా తీయగా, తమకు తెలియదని చెప్పారు. దీంతో బాధితులంతా బుధవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో వెస్ట్ ఏసీపీని ఆశ్రయించారు. ఆయన సలహాతో కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..

రూ.20 కోట్లు స్వాహా

ఫహీమ్ ట్రేడర్స్ పేరుతో మహమ్మద్ అబ్దుల్ ఫహీమ్ స్క్రాప్ వ్యాపారం చేసేవాడు. తాను.. తన మామ ఇక్బాల్‌తో కలిసి స్క్రాప్ వ్యాపారం చేస్తున్నానని, పెట్టుబడికి కొంత డబ్బు అవసరమని, సర్దుబాటు చేయాలని కొంతమంది వ్యాపారులను కోరాడు. స్క్రాప్ అమ్మేస్తే భారీ లాభాలు వస్తాయని, వాటా ఇస్తానని నమ్మించాడు. ట్రేడ్ లైసెన్స్, ఇతర డాక్యుమెంట్లను కూడా చూపించాడు. ఇది నమ్మి వించిపేటకు చెందిన మహమ్మద్ అక్బర్ ఇమ్రాన్ 2020వ సంవత్సరంలో కొంత డబ్బు ఇచ్చాడు. అయితే, ఫహీమ్ ఆ తరువాత రెండు విడతల్లో ఇమ్రాన్‌కు రూ.4 లక్షలు ఇచ్చాడు. అది లాభమని చెప్పాడు. నమ్మకం కలిగిన ఇమ్రాన్ మరికొంత సొమ్ము.. సుమారు రూ.80 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత ఓ ప్రైవేట్ సంస్థ నుంచి రూ.7 కోట్లకు స్క్రాప్ టెండర్ వచ్చిందని, పెట్టుబడికి కొంత డబ్బు కావాలని కోరాడు. అది నమ్మిన ఇమ్రాన్ తనకు తెలిసిన వారి వద్ద నుంచి అప్పు చేసి ఫిబ్రవరి 8వ తేదీన రెండు విడతలుగా రూ.9.2 లక్షలు, రూ.9.7 లక్షలతో పాటు మరోసారి రూ.10 లక్షలు ఆన్‌లైన్‌లో ఫహీమ్ ఖాతాకు పంపాడు. అప్పట్నుంచి ఫహీమ్ నుంచి ఎలాంటి స్పందన లేదు. దీనిపై ఇమ్రాన్ నిలదీశాడు. దీంతో ఓ ప్రైవేట్ సంస్థతో టెండర్ ఖరారైనట్లు రూ.7 కోట్ల డీడీ కాపీని ఇమ్రాన్ సెల్‌ఫోన్‌కు పంపించాడు. ఆ తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ నెల 15వ తేదీన ఇమ్రాన్ మరికొంతమందితో కలిసి ఫహీమ్ ఇంటికి వెళ్లాడు. పది రోజులుగా ఇంటికి రావడం లేదని కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే, ఫహీమ్ జాడ తెలియకపోవడంతో ఇమ్రాన్ తన స్నేహితులకు చెప్పాడు. కాగా, ఆ స్నేహితులు కూడా తాము పెద్ద మొత్తంలో ఫహీమ్‌కు డబ్బులిచ్చామని చెప్పి ఆందోళనకు గురయ్యారు. ఎస్‌కే ఇబ్రహీం ఖలీల్, షేక్ ఇర్షాద్, షేక్ అబ్దుల్ హమీద్ పాషా, షఫీ ఉల్లాఖాన్, అస్కర్ హుస్సేన్, పఠాన్ బాగీ, అబ్దుల్ రషీద్, షేక్ కాజా, అబ్దుల్ రెహమాన్, షబ్బీర్ తదితరులతో పాటు మరికొంతమంది నుంచి ఫహీమ్ దాదాపు రూ.20 కోట్ల వరకు వసూలు చేశాడని తెలిసింది. మోసపోయామని గ్రహించిన వారంతా బుధవారం పోలీసులను ఆశ్రయించారు.



సీపీ కార్యాలయం వద్ద బాధితులు



దుర్గగుడి ఆలయ శిఖరానికి స్వర్ణతాపడ పనులు వేగవంతం

» రెండోసారీ టీటీడీకే అప్పగింత.. భక్తుల నుంచి విరాళంగా సేకరణ

వన్‌టౌన్, మే 22 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రధాన ఆలయ శిఖరంలోని సగభాగానికి స్వర్ణతాపడం పనులు వేగవంతం చేశారు. ఎప్పటి మాదిరే స్వర్ణతాపడం పనులను తిరుమలతిరుపతి దేవస్థానం(టీటీడీ)కి అప్పగించారు. ఆలయ పైభాగం స్వర్ణతాపడాన్ని గతంలో టీటీడీనే నిర్వహించింది. దీనికి తగిన బంగారాన్ని, సంబంధిత పనులకుగాను స్వర్ణతాపడ నిపుణులకు మజూరీ తదితరాలను దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానమే భరిస్తుంది. స్వర్ణతాపడం నిమిత్తం దాతల నుంచి దేవస్థానం విరాళాలు స్వీకరిస్తున్నది. కనకదుర్గ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పేరిట విరాళాల సేకరణకు ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన డోనర్ సెల్‌ను ప్రారంభించారు. ఇప్పటి వరకు భక్తుల నుంచి సుమారు రూ.25 లక్షలకు పైగా విరాళాలు సమకూరాయి. స్వర్ణతాపడానికి సుమారు 75 కేజీల బంగారం అవసరమని అంచనా వేశారు. భక్తుల విరాళాలతో పాటు దేవస్థానం వద్ద ఉన్న బంగారాన్ని కూడా టీటీడీకి అప్పగించి స్వర్ణతాపడం పనులను పూర్తి చేయించేందుకు ఆలయ అధికారులు రంగం సిద్ధం చేశారు.



ద్వారకా తిరుమలలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దుర్గగుడి ఈవో రామారావు

ద్వారకా తిరుమల చిన్నవెంకన్నకు పట్టువస్త్రాల సమర్పణ

వన్‌టౌన్, మే 22 : ద్వారకా తిరుమలలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జరుగుతున్న బ్రహ్మోత్సవ కళ్యాణోత్సవాల సందర్భంగా బుధవారం విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం తరపున ఈవో కేఎస్ రామారావు, ఏఈవో రమేష్ బాబు, ముఖ్య అర్చకుడు మారుతి యజ్ఞనారాయణ శర్మ తదితరులతో కూడిన బృందం పట్టువస్త్రాలను సమర్పించింది. పట్టువస్త్రాలు, పరిమళ ద్రవ్యాలతో ఆలయానికి విచ్చేసిన బృందానికి ద్వారకా తిరుమల ఈవో త్రినాథరావు సాదర స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళధ్వనులు, వేదమంత్రాల మధ్య స్వామివారికి దివ్యసంకల్పం చేస్తూ అశేషజన ప్రజాక్షేమం కోరుతూ సంకల్పం చెప్పి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈవో రామారావు తదితరులకు ద్వారకా తిరుమల అధికారులు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.



ఆత్మీయ సమావేశంలో కేశినేని శివనాథ్, శ్రీరామ్ తాతయ్య, తదితరులు

ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ ఖాళీ

» టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, మే 22 : ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతుందని వైసీపీ నేతల పాపం పండిపోవడంతో ప్రజలందరూ కూటమి అభ్యర్థులకే ఓటు వేసేందుకు ప్రజలు పోటెత్తారని విజయవాడ కూటమి పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. బుధవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయననుకేశినేని చిన్నిని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే, జగ్గయ్యపేట అసెంబ్లీ అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్(తాతయ్య), శ్రీరామ్ సాయి, మండల, గ్రామ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం చిన్ని ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ, జగ్గయ్యపేటలో పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున అనుసరించాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలపై సలహాలు, సూచనలు చేశారు. మండల అధ్యక్షుడు కట్టా వెంకటనరసింహరావు, వత్సవాయి అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు, నందిగామ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ మన్నె కళావతి తదితరులు చిన్నిని కలిసిన వారిలో ఉన్నారు. తిరువూరు మండల, గ్రామ పార్టీ నాయకులను తిరువూరులో జరిగిన ఎన్నికల సరళిని గూర్చి కేశినేని చిన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు నాయకులు కేశినేని శివనాథ్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, గంపలగూడెం మండల అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి, ఏ.కొండూరు మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, తిరువూరు రూరల్ అధ్యక్షుడు వెంకట నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొమ్మసాని మహేష్, గంపలగూడెం క్లస్టర్ ఇన్‌చార్జ్ కొత్త రజనీకాంత్, సీనియర్ నాయకులు కిలారు రమేశ్, గద్దె వెంకన్న, డాక్టర్ జయసింహ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతకు చర్యలు చేపట్టండి : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం,మే22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రవాణా, పరిశ్రమలు, చేనేత, కార్మిక, కాలుష్యనియంత్రణ శాఖలపై బుధవారం కలెక్టర్ తన ఛాంబరులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో పోలీసులు నిఘా ఉంచాలన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో సంబంధిత వివరాలను ఈ-డీటెయిల్ట్ యాక్సిడెంట్ రిపోర్ట్(ఈ-డార్)లో నమోదుచేయాలని సూచించారు. ఇప్పటివరకు నమోదైన వివరాలను ఆయన పరిశీలించారు. రహదారి భద్రతకు సంబంధించిన అంశంపై ప్రతినెలా మూడో శుక్రవారం సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి అంశాలను సంబంధితశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలన్నారు. కాలుష్య నియంత్రణకు తగుచర్యలు చేపట్టాలన్నారు. పర్యాటకశాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపైనా కలెక్టర్ ఆరా తీశారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి పురేంద్ర, పరిశ్రమలశాఖ జీఎం వెంకట్రావు, పర్యాటకశాఖ అధికారి రామ్‌లక్ష్మణ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ డైవర్షన్ ఛానల్‌పై బూదవాడ రైతులు, రైల్వే అధికారుల భేటీ

జగ్గయ్యపేట : బూదవాడ-మేళ్ల చెరువు రైల్వేలైన్‌లో రైల్వే అండర్‌పాస్ సమస్య పరిష్కారానికి బుధవారం జగ్గయ్యపేట తహసీల్దార్ శేషు సమక్షంలో గ్రామ రైతులు, మధిర ఐడబ్ల్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా రైతులు అండర్‌పాస్ వల్ల కలుగుతున్న ఇబ్బందులపై జిల్లా కలెక్టర్‌కు పలుసార్లు ఫిర్యాదు చేయటంతో రైల్వే అధికారులు, రైతుల మధ్య ఏకాభిప్రాయం కుదరక సమస్య పరిష్కారం కాలేదు. ఈ సందర్భంగా గ్రామ రైతులు గుగ్లోతు బ్రహ్మం, బాణావత్ బ్రహ్మంలు 12 అడుగుల లోతులో అండర్‌పాస్ వల్ల నీరు నిలిచిపోయి రాకపోకలు సాధ్యం కావటం లేదని, అండర్‌పాస్ గోడల మీద నుంచి పొలాలకు వెళ్లటం ప్రాణాంతకంగా ఉందని వివరించారు. రైల్వే అధికారులు అండర్‌పాస్ వద్ద నుంచి వస్తున్న నీటిని కాలవ ద్వారా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామని, రైతులు సంవత్సరకాలం పాటు కాల్వ నిర్మాణం జరిగేంతవరకు ఇవ్వాలని కోరారు. పరిహారం విషయం ఎంత భూమి అవసరమవుతుందో తెలుసుకునేందుకు శుక్రవారం సర్వేయర్‌తో సర్వే చేయిస్తామని తహసీల్దార్ శేషు చెప్పారు. రైతులు తాము మిర్చి సాగు చేస్తామని, 400 ఎకరాల్లో 120 మంది రైతులు సాగుచేస్తున్నారని, సంవత్సరం పాటు ఆ పొలాలు సాగు చేయకుండా ఖాళీగా ఉంచితే తమ జీవనం సాగదని, తమకున్యాయంగా పరిహారం లెక్కించాలని కోరారు.



కామయ్యతోపుకు సమీపంలో ఒక బార్ వద్ద బహిరంగంగా మద్యం విక్రయిస్తున్న సిబ్బంది

బార్లు.. బార్లా!

» పెనమలూరులో 24 గంటలూ అందుబాటులో మద్యం

» ఉదయం పనులకు వెళ్లే కూలీలే లక్ష్యం

» పోలీసు, అబ్కారీ అధికారులకు రూ.20వేల పైనే నెలవారీ మామూళ్లు

పెనమలూరు : మండలంలో ప్రభుత్వ బార్లు నిత్యం మందుబాబులను దోపిడీ చేస్తున్నాయి. ఇక్కడ రోజువారీ కూలీలే లక్ష్యంగా 24 గంటలూ మద్యం విక్రయాలు చేస్తూ మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారు. క్వార్టరుకు రూ. 70 నుంచి రూ. 80 వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. అక్రమ విక్రయాలను నియంత్రించాల్సిన పోలీసు, అబ్కారీ అధికారులు మామూళ్ల మత్తులో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంతో మద్యం అమ్మకాలు మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.

రోజువారీ కూలీలే లక్ష్యంగా..

రోజూ ఉదయం పనులకు వెళ్లే కూలీలకు మద్యం అందుబాటులో ఉండటంతో వారు మద్యం సేవించి వెళ్లడం పరిపాటిగా మారింది. కామయ్య తోపు వద్ద ఉన్న బార్, వందడుగుల రోడ్డులో, నిడమానూరు రోడ్డులో బార్ల వద్ద విచ్చలవిడిగా మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. కామయ్యతోపు సమీపంలో బార్ బయట ఉదయం రెండు నుంచి మూడు కౌంటర్లు, పోరంకి నిడమానూరు రోడ్డులోని ఒక బార్ బయట ఏకంగా గోడకు రంధ్రాన్ని ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు.

పోలీసు, అబ్కారీ శాఖకు నెలవారీ మామూళ్లు

మండలంలో ప్రతి బారు నుంచి స్థానిక పోలీసు స్టేషన్, అబ్కారీశాఖకు ప్రతి నెలా ఇరవై వేలకు పైగా మామూళ్లు ఇస్తున్నా.. అధికారుల వేధింపులు ఏమాత్రం తగ్గడం లేదని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక బార్ యజమాని పేర్కొన్నారు. మండలంలో పదికి పైగా బార్లలో 24గంటలూ మద్యం విక్రయాల అనుమతుల విషయంలో పెనమలూరు స్టేషనుకు రెండు లక్షలు, అబ్కారీ శాఖ అధికారులకు రెండు లక్షలకు తగ్గకుండా అధిక మొత్తాల్లో చెల్లించాల్సి రావడంతో తమకు అన్నివేళలా మద్యం విక్రయాలు చేయాల్సిన పరిస్థితి ఉందని వాపోయాడు. ప్రజల జేబుకు చిల్లు పెడుతున్న బార్ల యాజమాన్యాలకు ముకుతాడు వేయడంతోపాటు సంబంధిత లంచావతార అధికారులకు ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.



నిడమానూరు రోడ్డులో ఒక బార్ గోడకు ఏర్పాటు చేసిన రంధ్రం ద్వారా విక్రయాలు

రాజకీయాలకు అతీతంగా పాడిరైతు అభివృద్ధికి కృషి

» కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, మే 22 : రాజకీయాలకు అతీతంగా సమష్టి కృషితో పనిచేయడం వల్లే పాడి రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వగలుగుతున్నామని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. డెయిరీ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు పదవి చేపట్టి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదారుల సంఘాలు, పాడి రైతుల ఆధ్వర్యంలో స్థానిక కాకాని కల్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించారు. చలసాని ఆంజనేయులును శాలువా, గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ, దివంగత ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగాలు తనకు స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్టీఆర్ కృషిఫలితంగా ఈరోజు పాడి రైతులకు గిట్టుబాటు ధర అందుతోందన్నారు. గ్రామాల్లో పాడి పశువులను పెంచే రైతులు, సంఘాల నుంచి మార్కెటింగ్ సిబ్బంది వరకు అహర్నిశలు కష్టపడి పనిచేయడంతో ఇది సాధ్యపడిందన్నారు. వీరవల్లిలో కోట్లాది రూపాయలు వ్యయంతో మరో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసుకోగలిగామన్నారు. ఇదే సహకారంతో మున్ముందు యూనియన్‌ను మరింత అభివృద్ధిపథంలో నడిపించేలా సమష్టి కృషి చేద్దామని చలసాని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, డైరక్టర్లు యెర్నేని సీతాదేవి, దాసరి వెంకట బాలవర్ధనరావు, చలసాని చక్రపాణి, బొడ్డు రామచంద్రరావు, బోయపాటి సుశీల, నెక్కలపు వాణిశ్రీ, వేమూరి సాయి, అంజిరెడ్డి, కొండలరావు, ట్రస్ట్ బోర్డు డైరక్టర్ పిన్నమనేని లక్ష్మీప్రసాద్, హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ మాగంటి హరిబాబు పాల్గొన్నారు. సంఘాల అధ్యక్షులు, పీడ్ కమిటీ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు, పలువురు స్థానిక రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు, సిబ్బంది చలసానిని ఘనంగా సత్కరించి అభినందించారు.



అభినందన సభలో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు



బాస్కెట్‌బాల్ టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు

ఉత్కంఠగా బాస్కెట్‌బాల్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, మే 22 : నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఏపీ యూత్ అంతర్ జిల్లాల(రాష్ట్రస్థాయి)బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు రెండోరోజు ఉత్కంఠగా సాగాయి. లీగ్ మ్యాచ్‌ల్లో బాలికల విభాగంలో చిత్తూరు-వైజాగ్‌పై 36-28, అనంతపురం-గుంటూరుపై 44-30, తూర్పుగోదావరి-కడపై 33-04, కృష్ణా -పశ్చిమగోదావరిపై 34-21, పశ్చిమగోదావరి-శ్రీకాకుళంపై 46-08, తూర్పుగోదావరి-గుంటూరుపై 43-09, అనంతపురం-కడపపై 27-06 తేడాతో విజయం సాధించాయి.

బాలుర విభాగంలో కర్నూల్-అనంతపురంపై44-41, వైజాగ్-గుంటూరుపై 42-22, పశ్చిమగోదావరి-చిత్తూరుపై 40-21, నెల్లూరు-శ్రీకాకుళంపై 55-46, కృష్ణా-చిత్తూరుపై 65-31, తూర్పుగోదావరి-గుంటూరుపై 43-09, వైజాగ్-నెల్లూరుపై43-04 తేడాతో విజయం సాధించాయి.

ఏఎన్ఆర్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం



గుడివాడ : స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ఈ నెల 26 వరకు కొనసాగనున్నట్టు ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్ తెలిపారు. బుధవారం కళాశాల పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా ఏడు కళాశాలల నుంచి 207, 8 పాఠశాలల నుంచి 211 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ శిబిరంలో పాల్గొంటున్నారన్నారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ సబ్యాసచిదాష్ ఆదేశాలతో 16 (ఆంధ్ర) బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంపు కమాండర్ కల్నల్ సన్వార్ సింగ్ ఆధ్వర్యంలో క్యాడెట్స్‌కు డ్రిల్, ఫైరింగ్‌లో శిక్షణిస్తున్నారన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు.. తృటిలో తప్పిన ప్రమాదం



చల్లపల్లి, మే 22 : ఆర్టీసీ బస్సు బ్యాటరీ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగటంతో ప్రయాణికులు ఆందోళనకు గురైన సంఘటన బుధవారం రాత్రి చల్లపల్లి బస్టాండ్ సెంటర్లో జరిగింది. మచిలీపట్నం నుంచీ పల్లెవెలుగు బస్సు ప్రయాణికులతో అవనిగడ్డ వెళుతోంది. చల్లపల్లి బస్టాండ్ సెంటరులో బస్సు కిందభాగంలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. బ్యాటరీల వద్ద షార్ట్‌సర్క్యూట్ జ రగటంతో బస్సు అడుగుభాగంలో మంటలు వస్తుండటంతో స్థానికు లు కేకలు వేయగా డ్రై వర్ అప్రమత్తమై బ స్సును నిలిపివేశారు. ప్రయాణికులు బస్సులోంచి కిందకు దిగారు. బ్యాటరీలను బయట కు తీసివేశారు. ప్రమా దం తప్పటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాదేవి

పోలీసుల నిర్లక్ష్యం..

వివాహితకు ప్రాణ సంకటం!

» 100కు ఫోన్ చేసినా ఫలితం శూన్యం

గుడివాడ, మే 22 : తనకు ప్రాణహాని ఉందని, భర్తే తనపై దాడి చేయడానికి వచ్చాడని 100కు పలుమార్లు ఫోన్ చేసినా పోలీసుల నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగా వివాహిత చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పలుమార్లు రెక్కీ నిర్వహిస్తున్నాడని, ప్రాణహాని ఉందని గోడు వెల్లబోసుకున్నా పోలీసులు పట్టించుకోలేదని, కనీసం నిందితుడిని స్టేషన్‌కు పిలిపించి, కౌన్సిలింగ్ కూడా యివ్వలేదని.. సకాలంలో స్పందించి ఉంటే హత్యాయత్నం జరిగి ఉండేది కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. స్థానిక ముబారక్ సెంటర్‌లో మరీదు నాగరాజు, దుర్గాదేవిలు నివాసముండే వారు. వారికి ఇద్దరు పిల్లలు. అనంతరకాలంలో భార్యపై భర్త నాగరాజుకు అనుమానం కలిగిన నాటి నుంచి ద్వేషం పెంచుకున్నాడు. భర్త పెట్టే హింసను భరించలేక 2017లోనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉంది. రెండేళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు మరింత పెరగడంతో విడివిడిగా ఉంటున్నారు. దీంతో దుర్గాదేవి గుడివాడ మండలం మల్లాయిపాలెంలోని జగనన్న కాలనీలో ఇద్దరు పిల్లలతో జీవిస్తోంది. నాగరాజు కుందేరులో ఉంటున్నాడు. భర్త నాగరాజు నుంచి తనకు ప్రాణ హాని ఉందని దుర్గాదేవి పలుమార్లు పోలీసులను ఆశ్రయించింది. భార్యాభర్తల గొడవ, పైగా కోర్టులో ఉండటంతో పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. ఇటీవల కాలనీలోకి నాగరాజు పలుమార్లు వచ్చి వెళ్లాడని సమాచారం. ఇటీవల కత్తి పట్టుకుని తిరుగుతున్నాడని, స్థానికులు దుర్గాదేవి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అప్రమత్తమైన దుర్గాదేవి 100కు ఫోన్ చేసింది. రాత్రి కాలనీకి వచ్చిన తాలుకా పోలీసులు మరోసారి వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పి వెళ్లారు. బుధవారం ఉదయం 7.45 గంటల సమయంలో పిల్లలకు టిఫిన్ నిమిత్తం బయటకు వచ్చిన దుర్గాదేవిపై నాగరాజు కత్తితో దాడి చేశాడు. కుడి చెయ్యి అడ్డు పెట్టడంతో తీవ్ర గాయమైంది. చెవి పక్కన కత్తి గాయమైంది. దీంతో దుర్గాదేవి కేకలు వేయడంతో స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఎలాగోలా అక్కడి నుండి నాగరాజు తప్పించుకున్నాడు. తీవ్ర గాయాలైన దుర్గాదేవిని స్థానికులు 108 వాహనంలో గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలుకా పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. కనీసం నిందితుడిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ యిచ్చిన దాఖలాలు లేకపోవడం, నాగరాజు కదలికలపై నిఘా పెట్టిన సందర్భాలు లేకపోవడంతో మరింత రెచ్చిపోయాడు. పోలీసులు నిర్లక్ష్యం, వైఫల్యంతో వివాహిత చావు బతుకుల మధ్య కొట్టిమిట్టాడుతోంది.



నిందితులతో పోలీసు అధికారులు

దివ్యాంగురాలిపై లైంగికదాడి కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

కంకిపాడు, మే 22 : దివ్యాంగురాలిపై లైంగికదాడి ఘటనలో నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దావులూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడిన గ్రామానికి చెందిన నల్లమోటు వేదాంత రాజు, చాట్ల జోజి బాబు, కొండేటి పెద్ది రాజును అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించినట్టు సీఐ తెలియజేశారు.

సాగు.. సాగేనా!

» ఏనుగులకోడు డ్రెయిన్‌పై సాగునీటి తూములు శిథిలం

» వేయి ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం

» ఏడాది నుంచి చర్యలు శూన్యం

» నీరంతా ఏనుగులకోడు డ్రెయిన్ పాలు

» బోర్లు, వర్షాలపైనే ఆధారపడాల్సిన దుస్థితి

సాగునీటి రంగాన్ని పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనడానికి ఏనుగుల కోడు డ్రెయిన్‌పై శిథిలమైన తూములే నిలువెత్తు సాక్ష్యం. సంబంధిత అధికారులు అంచనాలు తయారుచేసి పంపినా నిధులు మంజూరు కాక రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే పరిస్థితి దాపురించింది. తోట్లవల్లూరులో బందరు కాలువ నుంచి ఏనుగులకోడు డ్రెయిన్‌పై వ్యవసాయ భూములకు సాగు నీరందించాల్సిన తూములు ఏడాది క్రితం ధ్వంసమయ్యాయి. ఖరీఫ్ సమయం దగ్గర పడుతున్నా తూముల పునర్నిర్మాణ ఊసే లేకపోవటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.



చిల్లడొంక వెంట బందరు కాలువ సాగు భూములు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు కనకదుర్గమ్మ కాలనీ వెనుక వైపు గల చిల్లడొంక వెంట వెయ్యి ఎకరాల్లో వరి, చెరకు సాగుకు బోర్లు, వర్షాలపైనే రైతులు ఆధారపడేవారు. పక్కనే బందరు కాలువ ఉన్నా సాగునీరందని పరిస్థితిని నివారించేందుకు సుమారు 30 సంవత్సరాల క్రితం ఇరిగేషన్‌శాఖ తూములు నిర్మించింది. బందరు కాలువ కట్టను తవ్వి ఏనుగుల కోడు డ్రెయిన్‌పై చిల్లడొంక పంట కాలువలోకి నీరు వచ్చేలా తూముల నిర్మాణం జరిగింది. ఈ తూముల నిర్మాణంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయి. అయితే మూడేళ్ల నుంచి బలహీనపడిన తూములు గతేడాది విరిగి ఏనుగులకోడు డ్రెయిన్‌లో పడిపోయాయి. దీంతో గతేడాది బందరు కాలువ నుంచి వచ్చే నీరు విరిగిన తూము నుంచి ఏనుగుల కోడు డ్రెయిన్‌లో వృధాగా కలుస్తోంది. ఈ విషయాన్ని ఏడాది క్రితమే రైతులు అధికారులకు తెలియజేశారు. ఈ వేసవిలో తూముల పునర్నిర్మాణం చేపడతారని రైతులు ఎదురు చూసినా ఫలితం లేకుండా ఉంది. బోర్లు ఉన్న రైతులు నారుమడులు పోసుకుని సకాలంలో వరినాట్లు వేసుకునే పరిస్థితి నెలకొంది. మిగతా రైతులు వర్షాలపై ఆధారపడి నాట్లు వేసుకోవాలి. కాలువలకు జూన్‌లో సాగునీరు విడుదలయ్యే అవకాశం ఉండగా.. కాలువలకు నీరొస్తే నిధులు మంజూరైనా తూముల నిర్మాణం సాధ్యమయ్యే పనికాదని రైతులు చెపుతున్నారు. ఇది రైతులకు శాపం కానుందంటున్నారు. సాగునీరు మురుగులో కలిసిపోతుందన్నారు.





ఏనుగులకోడు డ్రెయిన్‌పై విరిగిపోయిన తూములు

వర్షాలే ఆధారం..



- ఈడ్పుగంటి డేవిడ్‌రాజు, రైతు

చిల్లడొంక ఏరియాలో అరెకరం పొలం ఉంది. బోరు లేనందున వరినాట్లకు కాలువ ద్వారా వచ్చే సాగునీరే ఆధారం. బందరు కాలువ నుంచి వచ్చే సాగునీటి తూములు విరిగిపోవటంతో ఈ ఏడాది వర్షాలపైనే ఆధారపడాల్సి ఉంది. తూములను పునర్నిర్మించటంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

నిధులు మంజూరు కాలేదు.

- వీరాంజనేయులు, ఇరిగేషన్ జేఈ

విరిగిపోయిన తూములను చూసి ఇరిగేషన్ వర్క్‌లకు అంచనాలు తయారుచేసి పంపాం. కాని నిధులు మంజూరు కాలేదు. దాంతో తూములు పునర్నించలేకపోయాం. నిధులు మంజూరైన వెంటనే తూముల నిర్మాణం చేపడతాం.

పేద విద్యార్థినికి టీడీపీ నాయకుల చేయూత

పెనమలూరు, మే 22 : పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి ఇంటర్‌లో కళాశాల ఫీజు కట్టడానికి ఇబ్బంది పడుతున్న చోడవరం గ్రామానికి చెందిన మోటూరి ఇందుప్రియకు చోడవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కలపాల శ్రీధర్ ఆధ్వర్యంలో నలభై వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కలతోటి ప్రసాదరావు, గురివింద బోసు, చాగర్లమూడి గౌతమ్, కలతోటి రామకృష్ణ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

సర్వీసు రోడ్డు ఆక్రమణ!

●యథేచ్ఛగా కట్టడాలు

గండిగుంట(ఉయ్యూరు) : గండిగుంట దత్తఆశ్రమం సమీపాన విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి సర్వీసురోడ్డు ఆక్రమించి కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఉయ్యూరు నుంచి గండిగుంట దత్తాశ్రమం, సర్వీసు రోడ్డు మీదుగా జాతీయ రహదారి మీదకు వెళ్లే మార్గంలో స్థానికులు రోడ్డును ఆక్రమించి ప్రహరీలు, ఇతర కట్టడాలు చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణ సందర్భంగా అవసరమైన మేర స్థలాన్ని సేకరించి యజమానులకు పెద్ద మొత్తంలో నష్టపరిహారం జాతీయ రహదారుల సంస్థ అధికారులు చెల్లించి నప్పటికి సర్వీసు రోడ్డు కొంతమేరకు ఆక్రమించి నూతనంగా కట్టడాలు చేస్తున్నారు. ఎన్నికల కార్యక్రమాల్లో ఉన్న అధికారులు పట్టించుకోపోవడంతో ఆక్రమదారులకు అడ్డులేకుండా పోతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఉయ్యూరు, పరిసర గ్రామాలనుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు, బస్సులతో అనునిత్యం రద్దీగా ఉండే సర్వీసు రోడ్డు ఆక్రమణకు గురవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆక్రమించినా అధికారులు ఎప్పటికో వచ్చి పగలగొడతారు అంతకన్నా ఏమి చేస్తారన్న ధీమాతో ఆక్రమణదారులు యథేచ్ఛగా కట్టడాలు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆక్రమణలు ఆపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గండిగుంట దత్తఆశ్రమం సమీపాన కట్టడాలు

కౌంటింగ్ రోజు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



పొట్టిపాడులో ప్రజలకు కోడ్ నిబంధనలను వివరిస్తున్న ఎస్సై పైడిబాబు

ఉంగుటూరు, మే 22 : సార్వత్రిక ఎన్నికల ఓట్లు కౌంటింగ్ రోజు గ్రామాల్లో ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అల్లర్లు, అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్కూరు ఎస్సై ఏ.పైడిబాబు హెచ్చరించారు. మండలంలోని పొట్టిపాడు గ్రామాన్ని బుధవారం తన బృందంతో కలిసి ఆయన సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడుతూ, ఎన్నికల ఫలితాలు తేలే రోజు ప్రజలందరూ వివాదాలు, గొడవలకు దూరంగా వుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో విద్వేషకరమైన పోస్టులు ఎవరైనా పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై ఏడీఎల్ జనార్దన్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియాలో కొంతమంది రెచ్చగొట్టే ధోరణిలో పోస్టులు పెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితి కనిపిస్తోందని, సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు సంయమనం పాటించాలని ద్వేషపూరితంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, మే 22 : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 11కెవి రాయ్‌నగర్ ఫీడర్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఎస్సీ కాలనీ, ఉపాధ్యాయ నగర్, రీచ్ రోడ్డు, సాయినగర్, చర్చి రోడ్డు బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియాలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.

పమిడిముక్కల : మండలపరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురజాడ, ఎగినాడుదిబ్బలు, పతేలంక, వీరంకి, హనుమంతపురం, చోరగూడి, అలినఖీపాలెం ప్రాంతాల్లో గురువారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్ టి.రామకృష్ణ తెలిపారు.



బందరురోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ప్రొద్దుటూరు వాసులు

రోడ్డు ఏర్పాటు చేయాలని రాస్తారోకో

కంకిపాడు, మే 22 : ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలంటూ బందరు రోడ్డుపై ప్రొద్దుటూరు గ్రామస్థులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు బందరు రోడ్డుపై నిలి చిన మరమ్మతు పనులను ఇటీవల ప్రైవేటు సంస్థ రూ. 33 కోట్లతో చేపట్టారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరు అడ్డ రోడ్డు వద్ద గ్రామంలోకి వెళ్లే కటింగ్‌ను రోడ్డు కాంట్రాక్ట్ సిబ్బంది మూసి వేశారు. దీంతో ప్రొద్దుటూరు గ్రామస్థులు బందరు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత గ్రామాలైన ప్రొద్దుటూరు, బొడ్డపాడు, పులపాక గ్రామాలకు చెందిన పంటలను ప్రొద్దుటూరు గ్రామం నుంచి తరలించాల్సి ఉంటుంది. ప్రొద్దుటూరు అడ్డ రోడ్డు మూసివేయడంతో ఆయా గ్రామాల ప్రజలతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. కిలో మీటర్ మేరకు ప్రయాణించి తిరిగి రావాల్సి ఉంటుందని ఆవేద వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు అడ్డ రోడ్డు వద్ద గ్రామంలోకి తిరిగేందుకు అవసరమైన జంక్షన్ ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



ఆత్కూరు పీఎస్‌లో బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్సై పైడిబాబు

ఉంగుటూరు, మే 22 : మానసిక స్థితి సరిగాలేక రైలెక్కి వచ్చేసిన బాలుడిని సురక్షితంగా అతడి తల్లిదండ్రులకు అప్పగించి పోలీసులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆత్కూరు ఎస్సై ఏ.పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నైట్ రౌండ్స్‌లో భాగంగా ఆత్కూరు పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ కిరణ్‌కిశోర్‌లు పెదఅవుటపల్లిలో మంగళవారం రాత్రి గస్తీ నిర్వహిస్తున్న క్రమంలో స్థానిక రైల్వేగేటు వద్ద మతిస్థిమితంలేని వాసంశెట్టి నూకరాజు(17)అనే బాలుడిని గమనించారు. వివరాలేమీ చెప్పలేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి అతడి అడ్రస్ కోసం వెతికారు. బాలుడి వద్దవున్న ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌కార్డు ఆధారంగా బాలుడు బాపట్ల జిల్లా, చీరాల మండలం, వాడరేవు గ్రామానికి చెందిన వాడుగా గుర్తించారు. వెంటనే ఈపూరుపాలెం ఎస్సైకి ఫోన్‌చేసి సమాచారమిచ్చారు. పోలీసుల ద్వారా బాలుడు సురక్షితంగా ఉన్నాడన్న సమాచారం అందుకున్న తల్లిదండ్రులు వెంటనే బయల్దేరి ఆత్కూరు పీఎస్‌కు వచ్చారు. తల్లిదండ్రులకు సురక్షితంగా బాలుడిని అప్పగించారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



లంకపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ వేడుకలో భక్తులు

ఉంగుటూరు, మే 22 : మండలంలోని లంకపల్లి అగ్రహారంలో కొలువైవున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చదలవాడ కుమారస్వామి, అర్చకులు శివనాగేశ్వరరావు ప్రసాద్ శర్మల నేతృత్వంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సహిత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఆశీనులు చేయించి వేదమంత్రోచ్చారణలు,మంగళవాయిద్యాలు, గోవిందనామస్మరణల నడుమ వేదపండితులు పరాశరం రామకృష్ణమాచార్య పాకయాజి ఆధ్వర్యంలో ఆయన శిష్యబృందం స్వామివార్ల కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా జరిపించారు. కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు గడ్డం వీరాస్వామి, అన్నం జ్వాలా నాగేశ్వరరావు, గ్రామపెద్దలు పోపూరి పూర్ణచంద్రరావు, జగదీష్, చింతా రమేష్, పాలడుగు గోపాలకృష్ణ, మాచినేని వెంకటేశ్వరరావు, వేమినీడు శ్రీనివాసరావు, జాలాది శ్రీనివాసరావు, పాలడుగు నేహ్నా తదితరులు పాల్గొన్నారు.



కేకు తినిపిస్తున్న విజయ డెయిరీ డైరెక్టర్ పాలడుగు నాని

పాడిరైతుల శ్రేయస్సే లక్ష్యం

కృష్ణామిల్క్‌యూనియన్ డైరెక్టర్ పాలడుగు నాని

గన్నవరం, మే 22 : పాడిరైతుల శ్రేయస్సే లక్ష్యంగా కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని అంజనేయులు పనిచేస్తున్నారని ఆ సంస్థ డైరెక్టర్ పాలడుగు వెంకట రామ వరప్రసాద్(నాని) అన్నారు. స్థానిక ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌లో చలసాని అంజనే యులు పదవి స్వీకరణ పొంది ఐదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం కేక్ కట్ చేసి అందరకి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాడి పరిశ్రమను అభివృద్ధి చేయటమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయమన్నారు. దానిలో భాగంగానే అత్యధిక పాలసేకరణ ధర, బోనస్ చెల్లింపు పాడి రైతు పశుసంక్షేమం, నూతన ఫ్యాక్టరీ నిర్మాణం వంటి పలు బృహత్తర కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. 2,266 మంది పాడి రైతు కుటుంబాల్లో వివాహాలు సందర్భంగా రూ.5కోట్లు అందజేశా మన్నారు. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందన్నారు. మేనేజర్ కె.కిరణ్‌కుమార్, లక్ష్మణరావు, ట్రస్ట్ కమిటీ సభ్యులు పునుకొల్లు రత్న ప్రసాద్(నాని), జె.హరిరామ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటమటలో పోలీసుల కవాతు

పటమట, మే 22 : ఎన్నికల పోలింగ్ అనంతరం ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా నగరంలో శాంతి భద్రతలు కాపాడే ఉద్దేశ్యంతో పటమట ఎస్ఐలు వల్లీపద్మ, సతీష్‌కుమార్‌లు బుధవారం సాయంత్రం పటమట వీధుల్లో తమ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు.

విద్యాధరపురం: భవానీపురం పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అవుట్ ఏజెన్సీలో పెట్రోలింగ్ నిర్వహించారు. సీఐగా కొత్తగా వచ్చిన ప్రసాద్ శాంతి భద్రతలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా ఎటువంటి గొడవలు చేయవద్దని, విద్వేషాలకు లోను కావద్దని, అరాచకాలకు పాల్పడవద్దని తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, మే 22 : విద్యార్థులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు, తేలప్రోలు, ఆత్కూరు, మానికొండ గ్రంథాలయాధికారులు యు. చంద్రశేఖరరావు, బి.శ్రీనివాసరావు, బీవీ కృష్ణారావు, ఎల్.హరికృష్ణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం ఆయా గ్రంథాలయాల్లో పుస్తకపఠనం, కథలు నేర్పించారు. ఆత్కూరులో యోగా ట్రైనర్ ఉదయ్‌కిరణ్‌చే యోగాసనాలు నేర్పించారు.



ఆత్కూరులో యోగాసనాలు నేర్చుకుంటున్న విద్యార్థులు



ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో..

ఉయ్యూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఖోఖో, చెస్, క్యారమ్స్, లెమన్‌స్పూన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్టు గ్రంథాలయ అధికారి రమణి తెలిపారు. రిసోర్స్ పర్సన్ కె. పవన్ విద్యార్థుల చేత పుస్తకపఠనం గావించి పుస్తకాలు చదవడం వల్ల ప్రయోజనాలు తెలియజేశారు.

వేటూరికి పుష్పాంజలి

విజయవాడ కల్చరల్, మే 22 : జీఆర్ పోలవరపు సాంస్కృతిక సమితి, గీతాంజలి మ్యూజికల్స్, వేద గంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ సినీ గేయ రచయిత డాక్టర్ వేటూరి సుందరరామ్మూర్తికి పుష్పాంజలి కార్యక్రమం జరిగింది. వేటూరి 14వ వర్ధంతిని పురస్కరించుకొని తుమ్మలపల్లి కళాక్షేత్రయ్య కళాక్షేత్రంలో స్థాపించిన వేటూరి కాంస్య విగ్రహం వద్ద వేటూరి అభిమానులు, కళాసంస్థల అధినేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంతవరకు వేటూరి పాట అజరామరంగా నిలుస్తుందన్నారు.

ప్రసాదంపాడులో పారిశుధ్యం అధ్వానం

గుణదల : ఒక పక్క మండు టెండలు.. మరో పక్క అకాల వర్షాలు.. దీనికి తోడు గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పల దుర్వాసనతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రసాదంపాడులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పంచాయతీ అధికారులు గాని, ప్రజాప్రతినిధులుకాని పట్టించుకోకపోవటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ వీధుల్లో ఎక్కడ చెత్తకుప్పలే అక్కడే ఉండటంతో దుర్వాసన వెదజల్లటంతో పాటు దోమలు విజృభిస్తున్నాయి. పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి పెట్టకపోతే అకాల వర్షాల కారణంగా చెత్తకుప్పలు మరింతగా కుళ్లి వచ్చే వాసనతో రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు భయభ్రాంతులవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు గ్రామ పారిశుధ్యంపై దృష్టి పెట్టి చెత్త కుప్పలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రసాదంపాడులో చెత్తకుప్పలు

అలంకారప్రాయంగా చలివేంద్రం!

పంచాయతీ అధికారుల తీరుతో నీరుగారిన లక్ష్యం

గుణదల : ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో వట్టి కుండలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. వాటిలో నీరు పోసిన సందర్భమే లేదు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రభుత్వమే ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రసాదంపాడు పంచాయతీ అధికారులు జాతీయ రహదారిపై ఫుట్‌పాత్‌మీద చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాని అజమాయిషీ మరిచారు. కనీసం కుండలపై మూతలు కూడా లేవు. ఇప్పటికైనా మండే ఎండలను దృష్టిలో పెట్టుకుని రోడ్లపై ప్రయాణాలు చేసేవారి దాహార్తిని తీర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పంచాయతీ అధికారులను కోరుతున్నారు.



పంచాయతీ ఏర్పాటు చేసిన చలివేంద్రం

పెరిగిన మహిళా ఓటింగ్

బాపులపాడు మండలంలో మహిళలే నిర్ణేతలు

హనుమాన్‌జంక్షన్ : సార్వత్రిక ఎన్నికల్లో బాపులపాడు మండలంలో మహిళల ఓట్లు అధిక శాతం పోలయ్యాయి. మండలంలో పోలైన ఓట్లలో పురుషులు కంటే మహిళా ఓటర్లే 5,240 మంది ఎక్కువగా నమోదు కావడం విశేషం. మహిళల ఓట్లు అధికంగా పోలవ్వడంతో టీడీపీ, వైసీపీ ఎవరికి వారు మాకే పడ్డాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం నియోజకవర్గం స్థాయిలో 84.88శాతం పోలింగ్ జరగడమే దీనికి నిదర్శనం. బాపులపాడు మండలంలో 94 శాతం పోలింగ్ జరిగింది. పురుషులు కంటే మహిళలు చైతన్యవంతంగా ఉంటారు. గెలుపోటములపై మహిళల ఓట్లు ప్రభావం ఎక్కువగా ఉం టుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మండలంలో 71,954 మంది ఓటర్లుగా ఉండగా అందులో పురుషులు 34,562, మహిళలు37,391 ఓటర్లు ఉన్నారు. పురుషులు కంటే మహిళలు 2,829మంది ఎక్కువ. అదే దామాషాలో పోలింగ్ కూడా ఎక్కువ నమోదు కావడం విశేషం. పోలింగ్‌లో కూడా పురుషులు కంటే మహిళలే ఎక్కు వగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 26,391 మంది, మహిళలు 31,631 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 6గంటలకే పురుషుల తో పాటు మహిళలు కూడా ఓటు వేయడానికి క్యూ కట్టారు. పురుషులు కంటే 5,240 మంది మహిళలు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండుటెండలో కూడా ఓపికగా నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రైల్వే స్టేషన్ సమీపం లోని ఎంపీపీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో రాత్రి 9గంటలు వరకు వేచి ఉండడం గమనార్హం. పురుషులు కంటే మహిళలు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకో వడంతో అభ్యర్థుల్లో మహిళల ఓట్లుపై ఆశలు పెంచుకున్నారు. వైసీపీ ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో మహిళా ఓటర్లంతా వైసీపీకే ఓటు వేసారన్న ఆశతో ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ మ్యానిఫెస్టో మహిళలకు ఆకర్షణీయంగా ఉండడంతో పాటు వైసీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, మద్యం సరఫరా తదితర విషయాల్లో మహిళల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, టీడీపీ కూటమి వైపై ఉందని ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పెరిగిన మహిళల ఓటింగ్ శాతంపై రెండు పార్టీల్లోనూ ఉత్కంఠ కొనసాగుతోంది.



బాపులపాడు పోలింగ్ కేంద్రంలో క్యూకట్టిన మహిళా ఓటర్లు (ఫైల్)

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	152, 161, 171
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

మట్టి అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ దాడులు

మచిలీపట్నం టౌన్, మే 22: మండలంలోని బుద్దాలపాలెం గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతూ రవాణా చేస్తున్న వాహనాలపై తహసీల్దార్ సతీష్ దాడులు జరిపారు. జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసి బాధ్యులపై కేసులు నమోదు చేశారు.



మట్టి తవ్వకాలపై విచారణ చేస్తున్న తహసీల్దార్ సతీష్

ర్యాలీలు, బహిరంగ సభలు వద్దు

● బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాని



మచిలీపట్నం టౌన్, మే 22: ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు జూన్ 4న వివిధ రాజకీయ పార్టీల నేతలు ఎలాంటి ర్యాలీలు, బహిరంగ సభలు జరపరాదని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సెక్షన్ 30 ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రజలెవరూ గుంపులుగా ఉండకూడదని, అనుమతి లేకుండా ర్యాలీలు, బహిరంగ సభలు డీజే సౌండ్స్ ఏర్పాటు చేయడం నిషిద్ధమన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని, మద్యంషాపుల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదని, మోటారు బైక్‌ల సైలెన్సర్లు తీసి శబ్దం చేయరాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయ నేతలంతా సహకరించాలన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

ఎన్నికల ఫలితాలు ప్రకటించేరోజున శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దని మచిలీపట్నం రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐలు వీరప్రసాద్, పద్మ పేర్కొన్నారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫలితాలపై సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెట్టరాదని, అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు జరపవద్దన్నారు.

పెడనలో కార్డన్‌సెర్చ్..

పెడన: ఓట్ల లెక్కింపు రోజున అల్లర్లు జరుగుతాయనే ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన పెడన పోలీసులు బుధవారం పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెం, రామలక్ష్మీ వీవర్స్ కాలనీలో కార్డన్ సెర్చ్ (తనిఖీలు) నిర్వహించారు. సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం వేకువజాము నుంచే కార్డన్‌సెర్చ్ ప్రారంభమైంది. కాలనీల్లోని ఇళ్లను, గడ్డివాములను, పరిసరాలను తనిఖీ చేశారు. అనుమానితుల సంచారంపై ఆరా తీశారు. సరైన ధ్రువపత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు ఎస్ఐలు, పెడన పోలీసు స్టేషన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ టీమ్ సిబ్బంది ఈ కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ

అవనిగడ్డ: ఎన్నికల సందర్భంగా ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతియుత వాతావరణం కొనసాగేలా చర్యలు తీసుకున్నామని, గ్రామాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, విమర్శించేలా ప్రవర్తించినా రౌడీషీట్లు తెరుస్తామని, ఎన్నికల అనంతరం ఊరేగింపులకు, బాణాసంచా కాల్చటానికి అనుమతి లేదన్నారు. సీఐలు వెంకట త్రినాథ్, నాగ ప్రసాద్, ఎస్ఐలు రమేష్ పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కోసూరులో కార్డన్‌సెర్చ్

కూచిపూడి: ఈ నెల 13న పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్ల కారణంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మండల పరిధిలోని కోసూరు గ్రామంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై నిఘా ఉంచారు. పేలుడు పదార్థాలు, మారణాయుధాలు అక్రమంగా నిల్వ ఉంచిన వారి గురించి సమాచారం అందించాలని గ్రామస్థులను కోరారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. పామర్రు సీఐ వి.సుభాకర్, కూచిపూడి ఎస్ఐ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ వాగ్దానాలు నెరవేరుతాయి

మచిలీపట్నం టౌన్: ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని, కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు, బ్రాహ్మణ సంక్షేమ పథకాలు నెరవేరుతాయని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నేత గన్నవరపు శ్రీనివాస్ అన్నారు. నగరంలో బుధవారం రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019లో బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన రెడ్డి నెరవేర్చలేదన్నారు. జూన్ 4న వచ్చే ఎన్నికల ఫలితాల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి రామకృష్ణారావు, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కృష్ణాజిల్లా కన్వీనర్ పి.వి. ఫణికుమార్, అంబటిపూడి నాగలక్ష్మి మాట్లాడారు.

ఐటీఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండు

మచిలీపట్నం టౌన్: ఐటీఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి విక్టర్‌బాబు అన్నారు. కృష్ణవేణి ఐటీఐలో బుధవారం కృష్ణాజిల్లా ఒకేషనల్ గైడెన్స్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు ఐటీఐ అడ్మిషన్లు, ఉద్యోగావకాశాలపై చర్చించారు. ప్రిన్సిపాల్ గౌరీమణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, విద్యాశాఖాధికారి పద్మ, ఒకేషనల్ గైడెన్స్ అధికారి సత్యబ్రహ్మం, సల్మాన్‌రాజు, కోటేశ్వరరావు, జయరాజు, వెంకటేశ్వరరావు, కె. రమేష్ పాల్గొన్నారు. జూన్ 10లోగా ఐటీఐలో ప్రవేశించేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 84మంది ఎంపిక

మచిలీపట్నం టౌన్: స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐలో ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 84 మంది ఎంపికయ్యారు. బుధవారం నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 154 మంది హాజరు కాగా ఇంటర్వ్యూల్లో 84 మందిని ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. అనంతరం ఎక్స్ఛేంజ్ అధికారుల సమావేశం జరిగింది.

రేపు డీ సెట్ ప్రవేశ పరీక్ష

మచిలీపట్నం టౌన్: ఈనెల 24న కానూరు పీఆర్ డిజిటల్ జోన్‌లో డీసెట్ ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. పెనమలూరు మండలం వందడుగుల రోడ్డులో కానూరు డిజిటల్ జోన్‌లో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్, గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు.

6వ రోజు పరీక్షలకు 368 మంది హాజరు

పెడన రూరల్: నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసెట్ 2024 ప్రవేశ పరీక్షలు 6వ రోజున 386 మంది విద్యార్థులకు గాను 368 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు.

జీవవైవిధ్య దినోత్సవ ర్యాలీ

ఘంటసాల: గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవంలో భాగంగా జాతీయ సేవా పథకంలో 2వ రోజు బుధవారం ఘంటసాల గ్రామంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆచార్య ఎన్.జి.రంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డా.అపర్ణ, డా.విజయకుమార్ పాల్గొన్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఆటలు, ఎస్సే రైటింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు

అవనిగడ్డ: పౌర గ్రంథాలయ శాఖ సంచాకుల ఉత్తర్వుల ప్రకారం అవనిగడ్డ ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు కథలు చదవటం, కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్ర లేఖనం, తెలుగు పద్యాలు, పాటలు, భగవద్గీత, డ్యాన్స్ నేర్పించారు. ఉపాధ్యాయులు ఎం.సంధ్య, డి.శ్రీజ, ఎం.శేషగిరిరావు, గ్రంథాలయాధికారి గ్రేడ్-1 జె.ప్రభుదాసు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దానాల్లో కెల్లా రక్తదానం మిన్న

● కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్: దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని నగర పాలకసంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ, ఏపీ యోగసభ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కమిషనర్ బాపిరాజు శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బాలాజీ, కార్యదర్శి శంకరనాథ్, మచిలీపట్నం ఆంధ్రప్రదేశ్ యోగసభ గురువులు గురునాథబాబు, రామిశెట్టి దుర్గాప్రసాద్, మెడికల్ ఆఫీసర్ కె. శివప్రసాద్, రెడ్‌క్రాస్ కోశాధికారి కొండపల్లి రామ్ బాలాజీ పాల్గొన్నారు.

కొనకళ్ల ప్రజాక్షేత్రంలోకి రావాలి: మండలి



కొనకళ్లను పరామర్శిస్తున్న బుద్ధప్రసాద్, వెంకట్రామ్

మచిలీపట్నం టౌన్, మే 22: టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణత్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి త్వరలో రావాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. గుండెపోటుకు గురై విజయవాడ రమేష్ చికిత్స పొంది నగరానికి తిరిగి వచ్చిన కొనకళ్ల నారాయణరావును బుధవారం టీడీపీ, జనసేన నేతలు పరామర్శించారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్‌తో పాటు అవనిగడ్డ టీడీపీ, జనసేన నేతలు పరామర్శించారు. బుద్ధప్రసాద్‌తో పాటు పలువురు మచిలీపట్నం టీడీపీ, జనసేన నేతలు కొనకళ్లను పరామర్శించారు.

కొనకళ్లకు తెలుగు మహిళల పరామర్శ

నాగాయలంక: గుండె శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న కొనకళ్ల నారాయణను బుధవారం ఆయన స్వగృహంలో కృష్ణా జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, దుర్గగుడి మాజీ సభ్యురాలు విశ్వనాథపల్లి పాప, లంకిశెట్టి నీరజ, వసంత, యాసం లంకమ్మ, సుంకర లక్ష్మీ, ఉషారాణి, కె.ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, మహాలక్ష్మి, మహిళా నేతలు పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత 'దిడ్ల' మృతి



అవనిగడ్డ రూరల్, మే 22: కాంగ్రెస్ పార్టీలో 35 ఏళ్లగా పనిచేస్తున్న దిడ్ల వీరరాఘవులు (52) బుధవారం తెల్లవారుజామున విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం రాత్రి పక్షవాతానికి గురైన వీరరాఘవులును కుటుంబసభ్యులు హుటాహుటిన విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పక్షవాతంతోపాటు షుగర్ బాగా పెరగటంతో చికిత్స పొందుతూ వీర రాఘవులు మృతి చెందారు. రాఘవులు మృతి వార్త తెలుసుకున్న కాంగ్రెస్ నేతలతోపాటు పలు పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వీర రాఘవులు భార్య రెండేళ్ల క్రితం మృతి చెందగా, ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె.

మాజీ ఎమ్మెల్యే దాస్ నివాళి

అవనిగడ్డ: కాంగ్రెస్ సీనియర్ నేత దిడ్ల వీరరాఘవులు పార్థివదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, నేతలు ఆది రామ్మోహనరావు, న్యాయవాది కర్రా సుధాకర్, రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పుట్టి కృష్ణుడు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

పమిడిముక్కల: మండలపరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురజాడ, ఎగినాడుదిబ్బలు, పతేలంక, వీరంకి, హనుమంతపురం, చోరగుడి, అలినకీపాలెం ప్రాంతాల్లో గురువారం ఉదయం 6 నుంచి 9 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్ టి.రామకృష్ణ తెలిపారు.

పిన్నెల్లిపై చర్యలు చేపట్టాలి: బుద్ధప్రసాద్

అవనిగడ్డ, మే 22: ఈవీఎం ధ్వంసం చేసిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని శాశ్వతంగా ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ డిమాండ్ చేశారు. ఈవీఎం ధ్వంసం చేశాడని తెలిసినా అధికారులు చర్యలు చేపట్టకపోవటం, అరెస్టు చేయకుండా తప్పించుకుపోవటానికి సహకరించటం కనిపిస్తోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించే వరకు చర్యలు చేపట్టకపోవటం రాష్ట్ర అధికార వ్యవస్థ ఎలా వ్యవహరిస్తుందో కేంద్ర ప్రభుత్వం గమనించాలని తెలిపారు. నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఫిర్యాదు చేసేవరకు జరిగిన సంఘటన బయటకు రాలేదంటే ప్రభుత్వ పనితీరును ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మండలి డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను కఠినంగా శిక్షించాలి: రాయపూడి

ఈవీఎంలను పగలకొట్టిన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కఠినంగా శిక్షించాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ పిన్నెల్లి 4సార్లు ఎమ్మెల్యేగా ఉండి ప్రభుత్వ విప్‌గా బాధ్యత వహించిన పిన్నెల్లి ఇలాంటి సంఘటనలకు పాల్పడటం దారుణమన్నారు. ఆయనపై అనర్హత వేటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలన్నారు.

మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య



చల్లపల్లి, మే 22: ఒంటరిగా నివసిస్తున్న వ్యక్తి మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటన ఇది. చల్లపల్లి శివారు గంగులవారిపాలెంకు చెందిన చిగురుపల్లి శ్యాంబాబు (33) బుధవారం తెల్లవారుజామున తాను నివసిస్తున్న గదిలో ఫ్యాను హుక్‌కు లుంగీతో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడు ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తుంటాడు. శ్యాంబాబుకు 2010లో వివాహం జరుగ్గా, పాప జన్మించింది. ఏడెనిమిదేళ్లుగా భార్యాభర్తలు విడిపోయి ఎవరికివారుగా నివసిస్తున్నారు. తల్లిదండ్రులు, సోదరుడు మరణించారు. మరణవార్త తెలుసుకున్న భార్య, కుమార్తె, చల్లపల్లి వచ్చారు. మృతుని సోదరి సునీత ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎ.పాండురంగారావు కేసు నమోదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీఆర్వో బేబి శవపంచనామా నిర్వహించగా, ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు.

గుడివాడ లిఫ్టర్లకు 10 పతకాలు

గుడివాడ: పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న తిరువూరులో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుడివాడ ఫిట్‌జోన్ లిఫ్టర్లు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో 10 పతకాలు సాధించి సత్తా చాటారు. బుధవారం ఫిట్‌జోన్ జిమ్ ఆవరణలో పతకగ్రహీతలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు మారెళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సైదా, ఐఎంఏ నేతలు డా.మాగంటి శ్రీనివాస్, డా.మలిరెడ్డి రవి అభినందించారు. టి.వెన్నెల బంగారు పతకం, రిత్విజ వెండిపతకం, ఎస్.మోహన్ బంగారు పతకం, వివేకానంద బంగారు పతకం, రిత్విక్ వెండి పతకం, మణికంఠ బంగారు పతకం, ఎల్.షేరిల్ వెండి పతకం, సురేష్ బంగారు పతకం, పి.రవికుమార్ బంగారు పతకం, వెంకటేశ్వరరావు బంగారు పతకాలు సాధించారన్నారు.

గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రంలో వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లు

గుడ్లవల్లేరు, మే 22: కృష్ణా మిల్క్ యూనియన్‌లో గత ఐదేళ్లలో పాడి రైతులకు రూ.54 ఉన్న పాల సేకరణ ధరను దఫాలుగా రూ.80కు పెంచిన ఘనత కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు దక్కిందని కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా డైరెక్టర్ వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు (కౌతవరం బాబూరావు) అన్నారు. బుధవారం యూనియన్ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతుల చేపట్టి ఐదేళ్లయిన సందర్భంగా గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా యూనియన్ డైరెక్టర్లు, గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రం పరిధిలోని పాలత్పత్తిదారుల సహకార సంఘ అధ్యక్షులు, వేతన కార్యదర్శులు హాజరై కేక్ కటింగ్ నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా డైరెక్టర్లు అర్జా నగేష్, వి.బి.కే.వి.సుబ్బారావు, మేనేజర్ తోట సత్యనారాయణ, ఫీడ్ కమిటీ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు సంఘ అధ్యక్షుడు వల్లభనేని బాపయ్య చౌదరి, విన్నకోట సంఘ అధ్యక్షుడు శాయిన హరిప్రసాద్, వివిధ సంఘాల అధ్యక్షులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

కూటమికే మెజారిటీ: పోతన స్వామి

పెడన: కూటమి అభ్యర్థులు కాగిత కృష్ణప్రసాద్, బాలశౌరికి గూడూరు మండలంలో 6వేలకు పైగా మెజారిటీ వస్తుందని గూడూరు టీడీపీ మండలాధ్యక్షుడు పోతన స్వామి అన్నారు. గూడూరులో బుధవారం కూటమి నేత సమావేశం జరిగింది. నేతలు దాసరి ఉమా సాయిరామ్, కోలపల్లి రజని, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, సిరివెళ్ళ శ్రీనివాసరావు, కట్టా మునీశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా స్నాతకపు కావిడి మహోత్సవం



కావిళ్లు సమర్పిస్తున్న శ్రీ వాత్సవ్ దంపతులు

అవనిగడ్డ, మే 22: స్థానిక శ్రీ భూనీలా సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్నాతకపు కావిడి మహోత్సవం దీవి పార్థ వెంకట రామ శ్రీనివాసాచార్యులు అధ్యక్షతన వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని శ్రీ అష్టలక్ష్మీ అమ్మవారి ప్రధాన అర్చక స్వామి శ్రీమాన్ రాఘవాచార్యులు విశిష్ట అతిథిగా పాల్గొనగా, ధర్మకర్తలు పోతరాజు షణ్ముఖ వెంకటాచల శ్రీవాత్సవ్ - మృణాళిని దంపతులు అర్చక స్వాములకు స్నాతకపు కావిడిలు సమర్పించారు. తొలుత నిత్యహోమం, బలిహరణం, విశేష హోమాలు, జగజ్యోతి ప్రజ్వళనం, ఎదుర్కోలు మహోత్సవాలు జరుగ్గా, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ఘనంగా యలమ్మ గ్రామోత్సవం

అవనిగడ్డ రూరల్: మండల పరిధిలోని మోదుమూడిలో కొలువైన శ్రీ యలమ్మ తల్లి గ్రామోత్సవం నిర్వాహకుడు మత్తి ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను ముగ్గుతో వేసి అలంకరించగా, పలువురు భక్తులు నైవేద్యాలు సమర్పించారు. యువత.. భక్తులకు శీతల పానీయాలు, మజ్జిగ పంపిణీ చేశారు.

శివాలయానికి రూ.లక్ష విరాళం

కోడూరు: గ్రామంలో పునర్నిర్మాణం జరుపుకుంటున్న శివరామకృష్ణ క్షేత్రం (శివాలయం)కు గ్రామానికి చెందిన పూతబోయిన వెంకట కృష్ణారావు కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళాన్ని అందించారు. బుధవారం ఆలయ కమిటీ వారు కృష్ణారావు ఇంటి వద్దకు వెళ్లి విరాళాన్ని అందుకున్నారు. నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్ బాబు, బడే భావన్నారాయణ, అన్నం దానారావు, అన్నం శివరామకృష్ణ, ఉల్లి రంగారావు, అన్నం సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

నాగేశ్వర స్వామి కల్యాణోత్సవం



మచిలీపట్నం టౌన్: స్థానిక కొజ్జిల్లిపేటలో వేంచేసియున్న నాగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి వైభవంగా స్వామికి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈవో, సిబ్బంది సహా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం

స్థానిక రాబర్టుసన్‌పేట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి వైభవంగా స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్తికేయ సేవా ట్రస్టు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి, సిబ్బంది పర్యవేక్షించారు. సాయికుమార్ పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవం

మండలంలోని పెదకరగ్రహారంలో వేంచేసియున్న లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో వైభవంగా స్వామి జయంత్యుత్సవం నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, స్వామి కల్యాణం, అన్నసమారాధన జరిగాయి. కమిటీ చైర్మన్ బొర్రా నటేష్, కమిటీ సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

శాంతి కల్యాణం

పెడన రూరల్: స్థానిక శ్రీ శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శాంతి కల్యాణం నిర్వహించారు. వార్షిక సేవను కొనసం నాగ చైతన్య, చంద్రరేఖ దంపతులు స్వామి కళ్యాణం నిర్వహించారు. అర్చకస్వామి భవాని శంకర్ వేదమంత్రాలతో నిర్వహించారు. ఈవో తిక్కిశెట్టి రామ్మోహనరావు పర్యవేక్షణ చేయగా కల్యాణంలో పాల్గొన్న భక్తులకు గూడూరు ఓంకారేశ్వర శర్మ, భాస్కరరావు తీర్థ, ప్రసాదాలు అందించారు.



స్వామి వార్లకి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న కాశీనాథుని నాగేశ్వరరావు

ఎలకుర్రు స్వామికి ఘనంగా రథోత్సవం

పామర్రు: మండల పరిధిలో ఎలకుర్రు అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి వార్షిక బ్రహోత్సవాలు బుధవారం 5వ రోజుకు చేరుకున్నాయి. మూలవిరాట్, అమ్మవార్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బలిహరణ, ఏకాదశ రుద్రాభిషేకం, అలంకరణలు, గణపతి పూజ, పుణ్యాహవచన, నిత్యాపోసన, సహస్రనామార్చన, వేదపఠనం, వీరభద్ర స్వామి వీధిపళ్లెం విశేష పూజలు ఘనంగా జరిగాయి. వంశపారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి 10గంటలకు రథోత్సవం నిర్వహించారు.

స్వామి హుండీ ఆదాయం రూ.3.81 లక్షలు

మండల పరిధిలోని ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. మొత్తం 41 రోజులకు గాను రూ.3,81,121 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి ఎల్ సత్యవతి తెలిపారు. తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈలెక్కింపులో పలువురు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.